అభినవ్ స్ఫూర్తితో యువత క్రీడల్లో రాణించాలి

● మేకల అభినవ్ జయంతిలో పలువురు నాయకులు

మేకల అభినవ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

కోదాడటౌన్, జూన్ 23 : చెస్ క్రీడలో ఆసియా చాంపియన్‌గా ఎదిగి కోదాడ పేరును ఖండాంతరాలను వ్యాపింపజేసిన దివంగత మేకల అభినవ్‌ను స్ఫూర్తిగా తీసుకొని నేటి యువత క్రీడల్లో రాణించాలని టీపీసీసీ డెలిగేట్ సీహెచ్. లక్ష్మీనారాయణరెడ్డి కోరారు. ఆదివారం మేకల అభినవ్ జయంతిని కోదాడ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల వద్ద ఉన్న అభినవ్ విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చెస్ క్రీడలో అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న సమయంలో రోడ్డు ప్రమాదంలో అభినవ్ మృతిచెందడం మన దేశ క్రీడా రంగానికి తీరని లోటు అన్నారు. అభినవ్ తండ్రి మేకల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ నెల 26న నయానగర్ వీధిలో అభినవ్ ఆర్చిని ఎమ్మెల్యే పద్మావతి ప్రారంభించనున్నట్లు తెలిపారు. అభినవ్ పేరుతో చెస్ క్రీడాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. దొంగరి శ్రీను అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అభినవ్ తల్లి మేకల అరుణ, మున్సిపల్ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వర్‌రావు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు వంగవీటి రామారావు, మాజీ సర్పంచ్ పారా సీతయ్య, కౌన్సిలర్ చందర్‌రావు, గంధం యాదగిరి, నాయకులు బొలిశెట్టి కృష్ణయ్య, ముత్తినేని సైదేశ్వర్‌రావు, సామినేని రమేశ్, బషీర్, కొమరగిరి రంగారావు, డాక్టర్ బ్రహ్మం, ఈదుల కృష్ణయ్య, ముత్తినేని సైదేశ్వర్‌రావు, దొంగరి శ్రీను పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

● రోడ్లు, భవనాల శాఖ అధికారులతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి

నేరేడుచర్ల/హుజూర్‌నగర్, జూన్ 23 : హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను నాణ్యతతో చేపట్టి, త్వరగా పూర్తి చేయాలని భారీ నీటిపారుదలశాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. ఆదివారం హైదరాబాద్‌లోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో రోడ్లు, భవనాలశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రెండు నియోజకవర్గాల్లో ఈ నెల 19న రూ.126 కోట్లతో శంకుస్థాపన చేసిన పనులను నాణ్యతతో చేపట్టాలన్నారు. దాంతో పాటు మరో రూ.131 కోట్లతో చేపట్టే రోడ్ల నిర్మాణ పనులకు త్వరలో టెండర్ల ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. కోదాడ నియోజకవర్గంలోని అనంతగిరి నుంచి చనుపల్లికి రూ. 20 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణం, మునగాల మండలంలోని బరాఖత్‌గూడెం నుంచి కీఆర్‌సీపురం వరకు రూ.20 కోట్లతో డబుల్ రోడ్డు, ఎన్‌హెచ్-9 నుంచి మోతే వరకు రూ.25 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణం, హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని మల్లారెడ్డిగూడెం నుంచి రేపూరు మీదుగా రామాపురం వరకు రూ. 20 కోట్లతో డబుల్ రోడ్డు, అమరవరం నుంచి అలింగాపురం వరకు రూ.20 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణం, నేరేడుచర్ల నుంచి దూపాడు వరకు రూ.26 కోట్లతో చేపట్టే డబుల్ రోడ్డు పనులకు త్వరితగతిన టెండర్లు పూర్తి చేయాలని ఆదేశించారు. కొత్తగా ఏర్పాటైన పాలకవీడు, చింతలపాలెం మండలాల్లో తాసీల్దార్, మండల పరిషత్, పోలీస్ స్టేషన్ భవనాల కోసం కేటాయించిన స్థలాల్లో నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి, అర్‌అండ్‌బీ సీఈలు మోహన్‌నాయక్, రాజేశ్వర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఐస్‌క్రీమ్ కప్పుల తయారీ కంపెనీలో అగ్ని ప్రమాదం

● రూ.1.50 కోట్ల ఆస్తినష్టం

దురాజ్‌పల్లి శివారులో ఫ్యాక్టరీ నుంచి ఎగిసిపడుతున్న మంటలు

చివ్వెంల, జూన్ 23 : సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం దురాజ్‌పల్లి గ్రామ శివారులో 65 జాతీయ రహదారి వెంట ఉన్న ఐస్‌క్రీమ్ కప్పులు తయారు చేసే కంపెనీలో ఆదివారం షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం సంభవించింది. ముడిసరుకు, మిషనరీ పూర్తి గా కాలిపోగా రూ.1.50 కోట్ల ఆస్తినష్టం వాటిల్లినట్లు యాజమాన్యం తెలిపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దురాజ్‌పల్లి శివారులో ఉన్న జయ శంకర్ పాలిమర్స్ కంపెనీలో ఐస్‌క్రీమ్స్ కప్పులు(ప్లాస్టిక్) తయారు చేస్తారు. ఉదయం 8 గంటల సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. కంపెనీ సమీపంలోని క్వార్టర్స్‌లో నివాసముంటున్న వాచ్‌మన్ గమనించి విషయాన్ని సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన కంపెనీ యజమాని యలగందుల సిద్ధార్థకు ఫోన్‌ద్వారా సమాచారం అందించాడు. ఆయన వెంటనే అగ్నిమాపక కేంద్రానికి, పోలీసులకు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలు అదుపు చేసేందుకు ప్రయత్నించారు. అయితే ఫైరింజన్‌లోని నీళ్లు అయిపోయినా మంటలు అదుపులోకి రాక పోవడంతో మరో ఆధునిక వాహనాన్ని తెప్పించి ఫోమ్ ద్వారా మంటలను ఆర్పివేశారు. కంపెనీ గోదాములో ఉన్న 40 టన్నుల ముడిసరుకుతో పాటు, తయారు చేసిన కప్పులు, రెండు యంత్రాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. రేకులతో వేసిన గోదాము కూడా పూర్తిగా ధ్వంసమైంది. కంపెనీ యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కనకరత్నం తెలిపారు.

బొగ్గు గనుల ప్రైవేటీకరణను నిరసిస్తూ..

ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం

ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

బొడ్రాయిబజార్, జూన్ 23 : దేశంలోని బొగ్గు గనులను ప్రైవేట్ సంస్థలకు అప్పగించాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని నిరసిస్తూ సీపీఐఎంఎల్ మాస్ లైన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రైతుబజార్ వద్ద ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ మాట్లాడుతూ ప్రధాని మోదీ గత పదేండ్లుగా కేంద్రంలో అధికారంలో ఉండి ప్రభుత్వ సంస్థలను ఆదానీ, అంబానీలకు కట్టబెట్టారని, మళ్లీ ఇప్పుడు మరోసారి బొగ్గు గనులను ప్రైవేట్ పరం చేయాలని ఆలోచన చేస్తున్నారన్నారు. తెలంగాణలోని సింగరేణి బొగ్గు గనులను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు చేస్తున్న కుట్రలను ప్రతి ఒక్కరూ తిప్పి కొట్టాలన్నారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుకూలంగా వ్యవహరిస్తే వారికి వ్యతిరేకంగా కూడా పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాస్‌లైన్ జిల్లా నాయకులు కారింగుల వెంకన్న, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్‌కుమార్, పార్టీ డివిజన్ నాయకులు సయ్యద్, పిడమర్తి లింగయ్య, రాంజీ, చంద్రకళ, సూరం రేణుక, జయమ్మ, పద్మ, ఐతరాజు పద్మ, బన్నీ పాల్గొన్నారు.

దండోరా రజతోత్సవాలను విజయవంతం చేయాలి

● ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చింత బాబు

ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బొడ్రాయిబజార్, జూన్ 23 : జూలై 7న హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించే మాదిగ ఉపకులాల దండోరా రజతోత్సవాలను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చింత బాబుమాదిగ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక పబ్లిక్‌క్లబ్ ఆడిటోరియంలో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించే ఉత్సవాలకు ప్రతి జిల్లా, నియోజకవర్గ, మండలం, గ్రామ స్థాయి నాయకులు తరలిరావాలన్నారు. ఎమ్మార్పీఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు పల్లేటి లక్ష్మణ్, జాతీయ ఉపాధ్యక్షుడు నన్నెపంగు సైదులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరికంటి అంబేద్కర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కనుక జానయ్య, రాష్ట్ర కార్యదర్శులు పడిదల రవికుమార్, బాణాల అబ్రహం, విజయభాస్కర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మేళ్ల చెరువు ముక్కంటి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్, కాశయ్య, సూర్యాపేట యువసేన అధ్యక్షుడు నాగరాజు, నాయకులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

నేరేడుచర్ల, జూన్ 23 : పట్టణంలోని ప్రధాన కూడలి వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందింది. ఈ ఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానిక పాల వ్యాపారి బాబూరావుకు చెందిన ఆవును మేతకు వదిలిపెట్టాడు. మేత మేస్తూ వెళ్లి ప్రధాన కూడలిలో రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడిక్కడే మృతి చెందింది. ఆవు విలువ రూ.70వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

నేరేడుచర్ల ప్రధాన కూడలిలో రక్షణలేకుండా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. ఈ ట్రాన్స్ ఫార్మర్ చుట్టూ తోపుడు బండ్ల వాళ్లు, చిరు వ్యాపారులు వివిధ వస్తువులు విక్రయించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎలాంటి రక్షణ గోడ లేక పోవడంతో మనుషులకు కూడా ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. రహదారి విస్తరణలో భాగంగా ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాల్సి ఉండగా అధికారులు పట్టించుకోలేదు. కనీసం రక్షణ గోడ ఏర్పాటు చేయక పోవడం వల్లే జంతువులు ప్రమాదాల బారిన పడుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ వలయాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

నాగారం, జూన్ 23 : మండలంలోని ఈటూరు గ్రామానికి చెందిన నీల యాదగిరి ఇల్లు శనివారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని ఎస్సీ కొత్త కాలనీలో నివాసముంటున్న యాదగిరి ఇంట్లో రాత్రి 11 గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ఇంట్లోని వస్తువులకు మంటలు అంటుకొని పూర్తిగా కాలిపోయాయి. దాదాపు రూ.4 లక్షల ఆస్తినష్టం జరిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆర్ఐ లక్ష్మీనారాయణ ఆదివారం ఘటనా స్థలానికి వెళ్లి పంచనామా నిర్వహించారు.

ఎమ్మెల్యే పరామర్శ

ఇల్లు దగ్ధమైన విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. ఆయన వెంట కాంగ్రెస్ మండలాధ్యక్షుడు తొడుసు లింగయ్య, నాయకులు భిక్షం, రమేశ్, యాదగిరి ఉన్నారు.

కల్వర్టుకు సైడ్‌వాల్ నిర్మించాలి

● సీపీఐ జిల్లా నాయకుడు ధనుంజయనాయుడు

ప్రమాదకరంగా ఉన్న కల్వర్టును పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

నేరేడుచర్ల, జూన్ 23 : నేరేడుచర్ల పట్టణంలోని జాన్‌పహాడ్ రోడ్డులో పెట్రోల్ బంక్ వద్ద కల్వర్టుకు సైడ్‌వాల్ లేక పోవడంతో ప్రమాదకరంగా మారిందని, వెంటనే అధికారులు స్పందించి సైడ్‌వాల్ నిర్మించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధూళిపాళ్ల ధనుంజయనాయుడు కోరారు. ఆదివారం కల్వర్టును సీపీఐ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరేడుచర్ల నుంచి జాన్‌పహాడ్‌కు నిత్యం వందల వాహనాలు రాక పోకలు సాగిస్తుంటాయని, కల్వర్టు వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. అధికారులు సైడ్ వాల్ నిర్మాణం చేపట్టాలని, అప్పటి వరకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. ఆయన వెంట పార్టీ పట్టణ కార్యదర్శి కత్తి శ్రీనివాస్‌రెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, నాయకులు వెంకట్, లక్ష్మయ్య ఉన్నారు.

గుంటుక తోలిన తుంగుతుర్తి సీఐ

గోరెంట్ల గ్రామంలో పెసర చేనులో గుంటుక తోలుతున్న సీఐ శ్రీనునాయక్

మద్దిరాల, జూన్ 23 : తుంగతుర్తి సీఐ శ్రీనునాయక్ ఆదివారం రైతుగా మారి గుంటుక తోలారు. విధి నిర్వహణలో భాగంగా మండలంలోని గోరెంట్ల గ్రామానికి వెళ్తుండగా గ్రామ శివారులో రైతు తన పెసర చేనులో గుంటుక తోలుతుండగాన్ని గమనించారు. వెంటనే కారు ఆపి రైతు వద్దకు వెళ్లి గుంటుక పట్టారు. తనది వ్యవసాయ కుటుంబమని చదువుకునే రోజుల్లో తల్లిదండ్రులకు వ్యవసాయ పనుల్లో సాయం చేసేవాడినని తెలిపారు. చాలా రోజుల తరువాత గుంటుక పట్టినందుకు ఆనందంగా ఉందన్నారు.

విద్యపై నిర్లక్ష్యం వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

● టీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బారి అశోక్

సమావేశంలో మాట్లాడుతున్న టీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బారి అశోక్‌కుమార్

బొడ్రాయిబజార్, జూన్ 23 : రాష్ట్రంలో విద్యాశాఖకు మంత్రి లేక పోవడంతో విద్యా వ్యవస్థపై పూర్తిస్థాయిలో నిర్లక్ష్యం నెలకొందని తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు బారి అశోక్‌కుమార్ అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు నెలలు గడిచినా విద్యాశాఖకు మంత్రిని కేటాయించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాల విద్య పూర్తిగా ధ్వంసమైందని గతంలో ప్రతిపక్షంలో ఉండి విమర్శలు చేసిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు స్వయంగా ముఖ్యమంత్రి హోదాలో ఉన్నా విద్య గురించి పట్టించుకోక పోవడం దారుణమన్నారు. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి లేక ప్రైవేట్, కార్పొరేట్, విద్యాసంస్థల వారు తమ ఇష్టానుసారంగా విద్యార్థుల నుంచి ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే పేద, బలహీన వర్గాలు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే విద్యాశాఖకు మంత్రిని నియమించాలని కోరారు. సమావేశంలో టీఎస్పీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వర్రె ఆంజనేయులు, బోనగిరి మహేశ్, నాయకులు ఉదయ్, నవీన్, శ్రావణ్, శ్రీకాంత్, నాగరాజు, శేఖర్, సందీప్, భరత్, సూర్య పరశురాం, వినయ్‌రాయ్, గణేశ్, సంజయ్ పాల్గొన్నారు.

30న డీటీఎఫ్ విద్యాసదస్సు

సదస్సు కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

సూర్యాపేట అర్బన్, జూన్ 23 : ఈ నెల 30న జిల్లా కేంద్రంలో డీటీఎఫ్ ఆధ్వర్యంలో విద్యా సదస్సు నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు రేపాక లింగయ్య తెలిపారు. ఆదివారం సూర్యాపేటలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సదస్సు కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దశరథ రామారావు ఉద్యోగ విరమణ సందర్భంగా ఉపాధ్యాయుల చైతన్యం కోసం విద్యారంగ, సామాజిక, రాజకీయ అంశాలపై సదస్సు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, విద్యావంతులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని సదస్సును విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు వెంకటేశ్వర్‌రావు, వెంకటేశ్వర్లు, వేణు, ఆనంద్ భాస్కర్, యాదగిరి, పరమేశ్ పాల్గొన్నారు.

అంబేద్కర్ యూత్ కమిటీ ఎన్నిక

గరిడేపల్లి, జూన్ 23 : మండలంలోని పొనుగోడు గ్రామంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో అంబేద్కర్ యూత్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నందిపాటి నరేశ్, ఉపాధ్యక్షుడిగా చిటికెల కిరణ్, ప్రధాన కార్యదర్శిగా ఒగ్గు మహేశ్, కోశాధికారిగా లంకపల్లి రమేశ్, సభ్యులుగా ఇరుగు అనిల్, కదురు మహేశ్, చిలక మధు ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులను గ్రామస్తులు అభినందించారు.

చేపలు పట్టేందుకు వెళ్లి వ్యక్తి మృతి

తుంగతుర్తి, జూన్ 23 : మండలంలోని మానాపురం చెరువులో ఆదివారం చేపలు పట్టేందుకు వెళ్లిన తండాకు చెందిన లాకావత్ హరి(49) చెరువులో మునిగి మృతి చెందాడు. లాకావత్ హరి వలతో చేపలు పడుతుండగా కాళ్లకు వల చుట్టుకోగా నీటిలో మునిగి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

కంఠ మహేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి తీర్మానం

గరిడేపల్లి, జూన్ 23 : మండలంలోని పొనుగోడు గ్రామంలో కంఠమహేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించాలని గౌడ కులస్తులు నిర్ణయించారు. ఆదివారం గ్రామంలో జరిగిన సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. ఆలయ నిర్మాణానికి కమిటీ ఏర్పాటు చేయడంతో పాటు నిధులపై చర్చించారు. సమావేశంలో గౌడ కులస్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి ఉత్సవం

గరిడేపల్లి, జూన్ 23 : మండలంలోని కాల్వపల్లి గ్రామంలో బొడ్రాయి, శీతల పరమేశ్వరీ, సీతారామచంద్రస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 1008 బిందెల నీటితో బొడ్రాయికి జలాభిషేకం, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. పురోహితులు ద్రోణ సుబ్రహ్మణేశ్వరశర్మ, రాయప్రోలు శ్రీరామయ్యశర్మ, దేవ మంగళశర్మ, దివాకరశర్మ, యోగేంద్ర చార్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న మంత్రి పొంగులేటి

● రోడ్డు ప్రమాద బాధితుడిని కాన్వాయ్ కారులో ఆస్పత్రికి తరలింపు

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడిని పరామర్శిస్తున్న మంత్రి పొంగులేటి

చివ్వెంల, జూన్ 23 : మండల కేంద్రం శివారులో జాతీయ రహదారి 365పై ఆదివారం సాయంత్రం బైక్‌పై వెళ్తున్న యువకుడిని కారు ఢీకొట్టింది. దాంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. ఖమ్మం జిల్లాలో పర్యటన ముగించుకుని హైదరాబాద్ వెళ్తున్న రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రమాదాన్ని గమనించి తన కారును ఆపారు. గాయాల పాలైన యువకుడిని తన కాన్వాయ్‌లోని కారులో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు. దాంతో యువకుడి కుటుంబ సభ్యులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

సూర్యక్షేత్రంలో పూజలు

అర్వపల్లి, జూన్ 23 : జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలోని సూర్యనారాయణ స్వామి క్షేత్రంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు చేశారు. యజ్ఞశాలలో మహా సౌరహోమం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో సౌర ఆరాధకుడు జనార్దన్‌స్వామి, నరేశ్, అర్చకులు మిర్యాల రామశర్మ, వేణుగోపాలశర్మ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తికి తీవ్రగాయాలు

చింతలపాలెం, జూన్ 23 : మండలంలోని గుడిమల్కాపురం గ్రామానికి చెందిన పోలోజు శివరామయ్యచారి ఆదివారం విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడ్డాడు. శివరామయ్యచారి ప్రైవేటు ఎలక్ట్రిషియన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గ్రామంలోని రైతు వ్యవసాయ బావి వద్ద బోరు మోటరు పనిచేయడం లేదని చెప్పడంతో బాగు చేసేందుకు వెళ్లాడు. పొలం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఫీజు పోయిందని గ్రహించిన చారి పైకెక్కి ఫీజు వేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే హుజూర్‌నగర్ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడి వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యంకోసం సూర్యాపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

ఆర్థిక సాయం

గరిడేపల్లి : ఆర్థిక సాయం అందిస్తున్న శ్రీవారి సేవకులు

గరిడేపల్లి, జూన్ 23 : మండలంలోని వెంకట్రాంపురం గ్రామానికి చెందిన కుర్ర సౌమిక గత నెల 29న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స పొందుతున్నది. ఆమె వైద్య ఖర్చులకు డబ్బులు లేక కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న గ్రామంలోని శ్రీవారి సేవకులు ఆదివారం సౌమికను పరామర్శించి, కుటుంబ సభ్యులకు రూ.16 వేలు అందించారు. కార్యక్రమంలో పురోహితులు కృష్ణశాస్త్రి, సేవకులు పాల్గొన్నారు.

గంగమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు

గంగమ్మ తల్లి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న యాదవులు

నడిగూడెం, జూన్ 23 : మండల కేంద్రంలోని గంగమ్మ తల్లి ఆలయ 14వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా యాదవులు గంగమ్మ తల్లి ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. సోమవారం నిర్వహించే వేడుకలకు యాదవులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

చిలుకూరులో..

చిలుకూరు : మండల కేంద్రంలోని చిలుకూరులో ఆదివారం గంగమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డబ్బుచప్పుళ్లు, కోలాటాలతో ఊరేగింపుగా మహిళలు బోనాలతో తరలివచ్చి గంగమ్మ తల్లికి నైవేద్యం సమర్పించారు. చెల్లించుకున్నారు. సాంప్రదాయ నృత్యాలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

కామ్రేడ్ ఎల్లన్నకు పలువురి నివాళి

కామ్రేడ్ ఎల్లన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐఎంఎల్ మాస్‌లైన్ నాయకులు

నేరేడుచర్ల, జూన్ 23 : కామ్రేడ్ ఎల్లన్న వర్ధంతిని ఆదివారం సీపీఐ(ఎంఎల్)మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడిన వ్యక్తి ఎల్లన్న అన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ వాస పల్లయ్య, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, పీవైఎల్ జిల్లా నాయకుడు వాస కరుణాకర్, పీఓడబ్ల్యూ అధ్యక్షులు లక్ష్మి, ఉపాధ్యక్షులు నాగమణి, శ్యామల, పావని, దేవయ్య, మౌలాంబీ, జాని బేగం, ఫాతిమా, కృష్ణమ్మ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ NAMASTHE TELANGANA CLASSIFIEDS

PLOTS FOR SALE

AP రాజధాని అమరావతిలో CRDA అప్రూవ్డ్ వెంచర్స్ కలవు. ORR 1/2KM కంచికచర్లకి 8KM గజం కేవలం 8499/-, పూలింగ్ ఏరియాకి ఆనుకొని గజం 25999/-, Cell:9100178179, 9849561472.

NLG-323529

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ వి